# బావి దొంగలు

## సురభి మనోహరరావు

"మహా ఘనత వహించిన జిల్లా కలెక్టర్ గారి సన్నిధానమునకు రంగాపురం గ్రామ కాపురస్థుడు కందాళ సింగరాచార్యులు అభ్యుదయోస్తుగా దీవించుచూ వ్రాయుంగల విన్నపములు .."

**మా తాలూకా** భూ తనఖా బ్యాంకు వారు దయచేయుంచిన ఋణ ద్రవ్యంతో నా భూమిలో నొక బావి త్రవ్వించుకొంటిని. కాని, దుండగులెవ్వరో దాని నపహరించి నా నోట దుమ్ముకొట్టిరి. ఋణ దాతలు చెల్లు వేయుంచనిచో నా కొంప ద్రవ్వి నడివీధిని బోయుదు మనుచున్నారు. కింకర్తవ్యతా విమూడుడనై ఉన్న సమయమున తాము ధర్మమూర్తులనియు, వ్యవహార దక్షులనియు కర్ణాకర్ణికగా వినవచ్చింది. చోరుల పాలైన నా బావిని నాకిప్పించి తీరెదరన్న విశ్వాసంతో తమకీ విన్నప మంపుకొను చున్నాడను. ఆపై తమ కృప, నా ప్రాప్తం!

విధేయుడు,

కందాళ సింగరాచార్యులు

రంగాపురం గ్రామం,

వింటే చిరునామాకు వచ్చిన ఆ ఉత్తరాన్ని చదువుకొన్న కలెక్టరుగారు మొదట మతి స్థిమితంలేని మనిషి ఎవ్వడో దాన్ని రాసి ఉంటాడనుకొన్నారు. కానీ ఆ పేరూ — పూర్తిగా లోగడ తెలిసి ఉన్నట్టుగా అనుమానం వచ్చింది. "ఎక్కడబ్బా?" అని ఆలోచిస్తే జ్ఞాపకం వచ్చింది— రానున్న రాష్ట్రావతరణోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరపున తాము సన్మానింపదలచిన వేద పండితుల జాబితాలో ఈ పేరు కూడా ఉంది. ఏదో నిశ్చయానికి వచ్చినట్లుగా ఉత్తరాన్ని డైరీలో దాచారు.

• • •

వేద పండితుల సన్మాన సభ కార్యక్రమం జరుగుతోంది. పేరు విని ఆ వ్యక్తి వేపు పరిశీలనగా చూశారు కలెక్టరుగారు. ఆ ముఖంలో విద్యాగంధం తాలూకు కళాకాంతులు తొనికిసలాడుతున్నా, అమాయకత్వమో, చాందసమో — స్పష్టంగా తెలియరాని మబ్బు తెర ఒకటి ఆ కళ్ళలో లీలగా కనిపిస్తూంది. శాలువా,సన్మానపత్రమూ అందుకొని వేదిక దిగబోతూన్న వాళ్ళ్ని "ఆచార్యుల వారూ" అని వెనుకకు పిలిచి, "మీతోకొంచెం మాట్లాడాలి. సాయంత్రం మా ఇంటికోసారి రాగలరా?" అన్నారు.

"చిత్తం! తప్పక వస్తాను" అంటూ చేతులు జోడించి వేదిక దిగే డతను.

• • •

"జరిగినదాంట్లో ప్రతి చిన్న విషయమూ వివరంగా చెప్పకపోతే నా వ్యథ తమ కర్థం కాదు. అలా చెప్పాలంటే చాలాసేపు పడుతుంది. తమరికవతల ఎన్నో వ్యవహారాలు. పైగా నా సొది తమకు విసుగు కూడా కలిగించ వచ్చు. ఆజ్ఞ అయితే ..." అంటూన్న సింగరాచార్యులను మధ్యలోనే ఆపి, "ఆలస్యమయినా ఫరవాలేదు, వివరంగానే చెప్పండి" అన్నారు కలెక్టరుగారు.

కాఫీ కప్పు ఒక్క గుక్కలో ఖాళీచేసి, వక్కపలుకు నోట్లో వేసుకుని, ఒక్క క్షణం కళ్ళు మూసి ఏదో గొణుక్కుని, మళ్ళీ సర్దుకుని ప్రారంభించారు ఆచార్యుల వారు.

"ఆరేళ్ళ క్రిందటి సంగతి. ఒకనాడో వ్యక్తి మా వూరొచ్చి — "నూటపది రూపాయలతో సభ్యత్వం పొంది, ఈ దరఖాస్తు ఫారం నింపి ఇస్తే, మీకు సేద్యపు నీటి బావి త్రవ్వుకోడానికి అయిదువేల రూపాయల అప్పు ఇస్తాం. మీరా మొత్తాన్ని స్వల్ప వడ్డీతో ఐదు వార్షిక వాయిదాల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అప్పుతీరేదాకా మీ భూమి మాత్రం బ్యాంకుకి తనఖా పెట్టాలి" అని వివరించాడు.

ఎన్నేళ్ళుగానో అలాంటి బావి త్రవ్వుకోవాలనుకుంటూ, పెట్టుబడి ఇచ్చే దాత లేక మిన్నకుండి పోయిన నేను ఆ మాటలు విని చాలా సంబరపడి పోయేను. 'ఎంతయినా మన ప్రభుత్వం మన ప్రభుత్వమే. పరాయివాడి రోజుల్లో ఇలాంటి సదుపాయా లెక్కడివీ?' అనుకుని ముందుకు వచ్చేను.

'దరఖాస్తు ఫారం ధర ఇరవై రూపాయ' లన్నాడు.

'బెత్తెడంత కార్డు ముక్కకే పదిపైసా లవుతుంది గదా—ఇంతపెద్ద కాగితాల బొత్తికి ఆ మాత్రం ధర న్యాయమే'' అనుకుని తలూపాను.

"దీన్ని నింపడానికి నా ఫీజు పది రూపాయలు" అన్నాడు.

'మళ్ళీ ఇదొకటా..సరేలెద్దూ—నాకు ముక్కా ముక్కా తెలిసి చావని ఆంగ్లంలో అన్ని కాగితాలు నింపడానికి ఆ మాత్రం తీసుకోకపోతే, ఎంతో వ్యయ ప్రయాసలతో అతను నేర్చిన చదువుకు ఫలితమేం గిడుతుందీ' అనుకొని దానికీ సరేనన్నాను.

పట్వారీని పిలిపించమన్నాడు. పిలిపించాను. ఈయనేవో వివరాలడిగాడు. ఆయన తన దస్త్రం తెప్పించిచూచి ఏదో చెప్పేడు. వాళ్ళిద్దరూ చర్చించుకొని ఏదో నిశ్చయానికి వచ్చేశారు.

పట్వారీ నా వేపు తిరిగి. "మీ భూములకు సంబంధించిన వివరాలూ వగైరా తహశీలు కచేరీ రికార్డుల్లోంచి ఎత్తి రాయించాల్సి ఉంటుంది. ఇరవై రూపాయలు ఖర్చు అవుతాయి మరి!" అన్నాడు. అదని కది మామూలే, మా కలవాటే, పట్వారీకిచ్చిన ఇరవైతో మొత్తం నూటఅరవై రూపాయలొదిలేయి. ఆ ఫారాల్లో ఏదో రాసుకుని, నాతో నాలుగైదు దస్కతులు తీసుకుని "మళ్ళీ వారం రోజుల్లో వచ్చి ఏ సంగతీ చెబుతా"నని వెళ్ళిపోయాడతను.

వారం రోజుల్లో అతను రాలేదు కానీ, నెలరోజులకు నాకో కార్డు వచ్చింది—"మీ అప్పు మంజూరైంది. భూముల తనఖా వ్యవహారం చూసుకునేందుకు రావలసింది" అని. కచేరీ వ్యవహారం గదా. తెలిసినవాడు వెంట ఉంటే బాగని పట్వారీని బతిమాలాను. ఖర్చులు నేను భరిస్తా నన్నాను. పైనో ఇరవై ఇస్తేనే కాని రాలేనన్నాడు. అవసరం కొద్దీ సరేనన్నాను. కాగితం ఖర్చులకీ, రిజిస్ట్రేషనుకి మూడొందలయినా తెచ్చుకోమన్నాడు. షావుకారిని బతిమాలి బామాలి, నూటికి నెలకు మూడురూపాయల వడ్డీ చొప్పున ముప్పావలా బాండు రాసిఇచ్చి మూడొందలూ తెచ్చాను. అప్పుడనిపించింది—అనవసరంగా ఈ వ్యవహారంలో తల దూర్చానేమోనని. అయినా అయిదు వేలు. అతి తక్కువ వడ్డీకిఅందునా ఐదు వాయిదాల్లో చెల్లించాల్సిన అప్పుకు. ఆ మాత్రం ఖర్చయితే నేం? వడ్డీ వారకూడా చెయ్యదు' అని సరి పెట్టుకున్నాను.

తనఖా వ్యవహారం ముగిసింది.

"మొత్తం అప్పును మీకు మూడు వాయిదాల్లో ఇస్తాం. కానీ మీరు ముందుగా మీ సొంత డబ్బుతో కొంత త్రవ్వించాలి. మేం వచ్చి. మీరు తవ్వించింది చూసి కానీ మొదటి వాయిదా డబ్బు ఇవ్వం. ఆ తరవాత మొదటి వాయిదా మొత్తానికి సరిపడా తవ్వితే రెండవ వాయిదా విడుదల చేస్తాం. అలాగే మూడవదీ" అన్నారు బ్యాంకు వాళ్ళు. తలూపి వచ్చేస్తూంటే, మొదట మా వూరొచ్చినాయన నన్ను పక్కకి పిలిచి, బాగా నీళ్ళు పడే స్థలం చూపే వ్యక్తి తన ఎరికలోనే ఉన్నాడనీ, అతను చూపిన చోట బావి తవ్వితే, పాతాళగంగ స్వయంగా పైకుబికి వస్తుందనీ చెప్పి, ఆయన చిరునామా వ్రాసి ఇచ్చాడు.

ఇల్లు చేరుకుని షావుకారిని మరోసారి బతిమాలి, మొదటి మూడొందలూ కలిస్తే వెయ్యి రూపాయలయ్యేట్లుగా ఏడొందలు తెచ్చి ఆయనేదో అంటారు. నీళ్ళుపడే స్థలం చూపే ఆఫీసరు—ఆయనకో నూరు రూపాయల దక్షిణ సమర్పించుకుని, స్థలమూ

ముహూర్తమూ చూసి తవ్వకం మొదలెట్టాను. షావుకారు ఇచ్చిన దాంట్లో మిగిలిన మొత్తం రెండు కోలల లోతు తవ్వేందుకు మాత్రమే సరిపోయింది.

సరే—మనం త్రవ్వకం మొదలు పెట్టగానే మొదటి వాయిదా డబ్బు ఇస్తా మన్నారు కదా అని బ్యాంకుకు వెళ్ళి అడిగితే, సూపర్‌వైజరు వచ్చి, జరిగిన పనిని చూసి తృప్తి పడి సిఫారసు చేస్తే తప్ప ఇవ్వడం కుదర దన్నారు. ఆ సూపర్ వైజర్ వూళ్ళో లేడు. అయిదారు సార్లు ఆయన చుట్టూ తిరిగాక అప్పుడు చల్లగా చెప్పాడాయన. తాను వచ్చి చూడడట. నా మాట మీద తనకు సంపూర్ణంగా నమ్మకం ఉందిట. కానీ, తన మాట మీద పై వాళ్ళకు లేదట. వంద రూపాయలు ముట్ట చెబితే కాని పని జరగదట

మధ్యన వీళ్ళ చుట్టూ తిరిగేందుకే వందకు పైగా వూడింది. నిరాశగా మా వూరికి తిరిగొచ్చి, తెలిసిన వాళ్ళతో ఆలోచించాను. "ఇంత జరిగాక ఇప్పుడు వెనకడుగు వేస్తే, ఇంతవరకు చేసిందీ వ్యర్థమేకదా? ఏమైనా సరే, చివరి దాకా చూడ"మని సలహా ఇచ్చారు. మళ్ళీ డబ్బు సంపాదించేసరికి తాతలు దిగొచ్చారు. అడిగినదంతా ఆయన చేతులో పెట్టి తొందరగా పనిజరిగేట్టు చూడమన్నాను. ఆయనేవో కాగితాలు వ్రాసి బ్యాంకులో ఇచ్చేశాడు. బ్యాంకులో వాళ్ళు నాలుగురోజు లాగి వస్తేనే కానీ వీల్లేదన్నారు. దిక్కు తోచక తిరిగొస్తూంటే, చప్రాసీ ఒకడు నన్నాపి, పని జరిగే మార్గం ఉపదేశించాడు. తనకో పదీ, ఇద్దరయ్యగార్లకు చెరో యాభై యేసి, ఆపై వాడికో వందా సమర్పిస్తే క్షణంలో అంతా అయిపోతుందన్నాడు. "మరెలా? నా దగ్గర తిరుగు చార్జీలకైనా లేవే!" అన్నాను.


ఆతనేదో ఆలోచించి, "మీరు 'వూ' అంటే వ్యవహారమంతా నేను చూసుకుంటాను. కాకపోతే, నాకు మరో పది ఎక్కువ ఇవ్వాలి. పది రూపాయల ముఖం చూడకండి. గంట సేపట్లో పని ముగించుకుని ఇంటి దార్లో ఉంటారు. వాళ్ళన్నట్టు మీరు నాలుగు రోజు లాగి వచ్చినా, అప్పుడైనా ఇలా జరగాల్సిందే" అన్నాడు.

అప్పటిగ్గానీ నా కా వ్యవహారం పూర్తిగా అంతు బట్టలేదు. కానీ ఏం లాభం? అప్పటికే పీక ల్దాకా వూబిలో కూరుకు పోయాను. "వూ" అన్నాను అయోమయంగా

సాయంత్రానికల్లా పన్నెండొందలు చేతి కిచ్చారు, అదేమంటే, మొదటి వాయిదా మొత్తం పదహారొందలనీ, నాలుగు వందలు వాటాధనం కింద మినహాయించుకున్నామనీ వివరించారు. ఏమీ మాట్లాడలేక గుమ్మం దాటానో లేదో ఉదయం నాకు జ్ఞాన బోధ చేసిన మహానుభావుడు! అన్న మాట ప్రకారం ఇమ్మాటిరవై రూపాయలూ ఆయన కర్పించుకుని, ఇంకా అక్కడే ఉంటే మరేమైనా ముంచుకు రావచ్చునని, ఎవరో తరుముతూన్నట్లుగా మా వూరి కొచ్చి పడ్డాను.

బస్సుదిగగానే అపశకునంలా కనిపించాడు షావుకారు. కలిసి నడుస్తున్నాం. యథాలాపంగా అన్నట్లు, "మూడొందలకి మూణ్నెల్లూ ఏడొందలకి రెణ్నెల్లూ మొత్తం వడ్డీ అరవై తొమ్మిదీ" అన్నాడు. నే నేం






చేసిందీ నాకే తెలియలేదు కానీ, ఇంటి కొచ్చి చూసుకుంటే, ఏడుకొండల వాడి పట్టెవర్ధనాల్లా నూటపదకొండు రూపాయలు మిగిలాయి. మొదట రాసిన మూడొందల బాండూ షాహుకారి దగ్గరే ఉంచాల్సొచ్చిందని జ్ఞాపకంకూడా వచ్చింది.

భోజనం చెయ్య బుద్ధి కాలేదు. అప్పటివరకూ అయిన ఖర్చుని పద్దు వారీగా లెక్కేసుకుంటే, బావీ, బ్యాంకు వాటాలూ అన్నీ కలిపి రెండువేలు అయ్యాయి. వాళ్ళిచ్చే మొదటి వాయిదా పదహారొందలకీ ముందస్తుగా నా పెట్టుబడే నాలుగొందలు ఎక్కువయిందన్న మాట!

వాళ్ళు రెండో వాయిదా ఇవ్వాలంటే, నేను మొదటి వాయిదా పదహారొందలకు సరిపడా బావి తవ్వించి ఉండాలి. అందుకు మరోసారి అప్పూ, మరోసారి వడ్డీ, మళ్ళీ తిరుగుళ్ళూ, దక్షిణా.. అబ్బో! అదో యజ్ఞం.

ఈలోగా వర్షాలారంభమయినాయి. సేద్యపు గొడవల్లోనూ, పౌరోహిత్యపు పనుల్లోనూ పడి మరే సంగతీ పట్టించుకో లేదు. వర్షాలకు లోగడ తవ్వించిన గోయి కాస్తా చదునయింది.

శీతాకాలం ప్రారంభంలో మొదట మావూ రొచ్చినాయన స్థానంలో కొత్తగా వచ్చినాయనట—మరో పెద్దమనిషి వచ్చి, "మీ లోన్ ఇన్‌స్టాల్‌మెంటు అవసరం లేదా?" అంటే లెక్కలన్నీ చెప్పి చేతులు జోడించాను ఇక అక్కర్లేదని.

"మీరు తీసుకున్న అప్పు ఇప్పటికి వడ్డీతో దాదాపు రెండు వేలౌతుంది. ఇప్పుడు మీరు వద్దంటే అదంతా ఏట్లో పోసినట్లే కాదా?" అన్నాడు. 'అయినా సరే, అక్కర్లే'దన్నాను. ఆయనో అరగంట వాగి, నన్నెటూ తోచని స్థితికి తెచ్చాడు. పక్కనున్న వాళ్ళూ ఆయనకే వంత పాడారు.

"మరి మీకు నేనక్కడ పదహారొందల రూపాయల పని చూపించాలి గదా—పదహార-రూపాయల పనైనా కనపడదే" అన్నాను.

అదంతా తను చూసుకుంటాననీ, నాలుగురోజుల్లోగా రెండో విడత సొమ్ము చేతి కొచ్చేలా చూసే పూచీ తనదనీ అన్నాడు. ఆశ మరోసారి నన్ను లొంగ దీసుకుంది. ఫలితంగా షావుకారికి మరో మూడొందలకి బాండు రాశాను. ఆ మరునాడే ఆయన తనొంతు కాగితాల్ని బ్యాంకులో ఇచ్చేశాడు. ముందు మొండిగా నాలుగైదు సార్లు బ్యాంకు చుట్టూ తిరిగినా లాభం లేకపోయింది. గతానుభవాన్ని పురస్కరించుకుని నాకు మొదట జ్ఞానబోధ చేసిన మహానుభావుణ్ణి కలిసి. మళ్ళీ నా వంతు కాగితాల్ని నేనూ ఇస్తేనే కానీ పని జరగలేదు. పాత లెక్కే! పదహారొందలు చేతి కొచ్చాయి. అయిన ఖర్చు నాలుగు వందలు. పాత బాకీ, కొత్తదీ, వడ్డీ కలిపి ఏడొందలు షావుకారి కిచ్చేశాను. మిగిలిన దాంతో పూడిన గోతిలోంచి మట్టికూడా పైకొచ్చేలా లేదు. పని మాత్రం ప్రారంభించాను. ఇంతలోనే ఒక పెద్ద ఉపద్రవం వచ్చి కొచ్చేసింది.

సూపర్‌వైజరు ఒక రోజు ఉరుకులూ పరుగులూ పెడుతూ హడావుడిగావచ్చి, "కొంప మునిగిందయ్యా" అన్నాడు. "ఎందుకూ?" అన్నాను. వాళ్ళ పై అధికారి ఎవరో తనిఖీకి వస్తున్నాడట. నా కిప్పటికి రెండు వాయిదాల డబ్బు ఇచ్చారు కనక, మూడింట రెండొంతుల పనైనా పూర్తయి ఉండాలట. లేకుంటే నేను మొత్తం డబ్బూ ఏక కాలంలో కక్కవలసి రావడమే కాక, తమ ఉద్యోగాలే పోవచ్చు నన్నాడు.

నేను బావి తవ్వక పోవడానికీ, ఆయన ఉద్యోగం పూడడానికీ సంబంధం నా కర్థంకాలేదు. ఆ మాటే ఆయనతో అంటే, "నీవు తవ్వినట్లు మేం సర్టిఫికెట్లిచ్చాం గాదయ్యా" అన్నాడు.

"పనైతే ప్రారంభించాం గదా! అయినంతవరకూ చూపించి, మిగతాది తొందర్లోనే పూర్తి చేస్తామని చెబుదాం!" అన్నాను.

"ఏమిటయ్యా అంటుంది? మూడింట రెండొంతులంటే దాదాపూ పూర్తిగా అయిపోయి ఉండాలి గదా! నీ గోయి నూతిలా గాక, పీనుగుని పూడ్చేందుకు తవ్విన బొంద లాగుంది" అన్నాడు. నా క్రోధం నసాళాని కంటింది. 'ఇదేం ఖర్మరా, భగవంతుడా' అనుకుని "మరిప్పు డేది దారి?" అన్నాను, సాధ్యమైనంత సౌమ్యంగా.

అతను చాలాసేపు ఆలోచించి, "ఏమీ లేదు. ఆయన్ని అక్కడిదాకా వెళ్ళనివ్వకూడదు. అసలాయన ఆ నూట అనే అవకాశమే రానివ్వకూడదు. వూళ్ళోకి రాగానే బ్రహ్మాండంగా పార్టీ ఇవ్వాలి. కబుర్లలో పెట్టి పని మరిపించాలి. అయినా ఆ గడుసునుండా కొడుకు తప్పదని పట్టుబడితే, నోరు మూయించేందుకు దక్షిణ సిద్ధంగా ఉండాలి. ఇంతకన్నా మార్గం లేదు. వింటున్నావా?" అన్నాడు.

వాక్యాలయితే వినబడ్డాయికానీ, భావంమాత్రం అర్థం కాలేదు. అదే మాట ఆయనతో అంటే, నన్ను పురుగుని చూసినట్లు చూసి, తల పట్టుకున్నాడు, ప్రక్కనున్న పట్వారీకేసి చూస్తూ. పట్వారీ కర్థమయింది కాబోలు. ఏదో ఆలోచించి, "పంతులూ! నీ దగ్గ రిప్పుడు ఎంతుందేమిటీ?"—అనడిగేడు, నావేపు చూసి.

"మొన్న పదహారొంద లిచ్చేరు. నాలుగొందలక్కడే పూడేవి ..."

"నీ బోడి లెక్క లెవడడిగేడు గానీ, ఇప్పుడు చేతిలో ఎంతుందో చెప్పు."

"నాలుగు వందల పై చిలుకు ఉంది."

ఆ పైన వాళ్ళిద్దరూ ఏదో చర్చించుకున్నారు. చాలాసేపటికి నావేపు తిరిగి, "ఉన్నదేదో పట్వారీ గారికి తెచ్చి ఇవ్వు. ఆ వ్యవహార మేదో ఆయనే చూసుకుంటాడు" అని నేను సంకోచిస్తూంటే, "కదంవేం? ఉన్న చేరెడు చెక్కా పూడగొట్టుకోవాలని ఉందా?" అన్నాడు.

ఎవరో తరుముతూన్నట్లుగా ఇంటికి పరుగెత్తి కెళ్ళి, ఎంతుందో లెక్కైనా పెట్టకుండా మొత్తం తెచ్చి పట్వారీ చేతుల్లో పోసేను. "ఎంతుందీ?" అని ఆయన అడిగినా, నోరు తెరిస్తే దుఃఖం బయట పడుతుందనే భయంతో మాట్లాడకుండా ఉండిపోయాను. అతనే లెక్కపెట్టి, "నాలుగు వందల ఇరవై ఉన్నాయి" అన్నాడు. తలూపాను.

"రేపటి గండం గడిచి గట్టెక్కితే, లెక్కచూసి, మిగిలితే నీకే ఇచ్చేస్తాడులే!" అన్నాడు. నేనేమీ అనలేక, తలూపి ఇంటి కొచ్చేశాను.

మర్నాడు మధ్యాహ్నాని కల్లా నలుగురు జీపు దిగేరు. సూపర్‌వైజరూ వాళ్ళతోపాటే దిగి, సంచి నిండా ఉన్న సీసాలు పట్వారీ కప్పగించాడు. సాయంత్రందాకా తింటూ, తాగుతూనే ఉన్నారు. చీకటి పడేవేళకు నన్ను పిలిచి, "ఏం— పంతులూ! నీ బావి పని ఎందాకొచ్చిందీ?" అన్నాడు, అందులో ఒకాయన. నేను నోరు విప్పేలోగా, మళ్ళీ తనే పెద్దగా నవ్వుతూ—"ఇలాగైతే ఎలాగయ్యా! ఇక మీరు బాగుపడరు. ప్రభుత్వం మిమ్మల్నుద్ధరించడానికి వేస్తూన్న పథకా లన్నింటినీ మట్టిపాలు చేస్తున్నారు గదయ్యా!" అన్నాడు.

నేనేదో మాట్లాడబోతూండగా పట్వారీ నాకేసి చీదరగా చూశాడు. మళ్ళీ ఆ పెద్ద మనిషే అన్నాడు:

"మీరిలా ప్రభుత్వాన్నీ, బ్యాంకుల్నీ వెర్రివాళ్ళని చేసి, డబ్బులాగి, మజా ఉడాయిస్తారు. ప్రోగ్రెస్—డెవలప్‌మెంటో— అంటూ ప్రభుత్వం మా ప్రాణం తింటుంది. ఎందుకొచ్చిన బాధలయ్యా మా కివి? డబ్బు మీ కిచ్చి చిక్కుల్ని మా తల కెత్తుకుంటే మా కొరిగే దేమిటయ్యా?" అంటూండగానే పట్వారీ కల్పించుకొని, నా కర్థం కాని ఉరుదూలో గుసగుసలాడాడు. కొద్దిసేపట్లోనే నే నొకడి నక్కడ ఉన్నానన్న సంగతే మరిచి, అందరూ లోపలి కెళ్ళిపోయారు.

ఇక నే నక్కడుండి చేయగలిగినదేమీ లేదనుకుని ఖర్మని తిట్టుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొ తిరిగొచ్చేశాను.

మర్నాడు ఉదయం నన్ను పిలిపించారు వెళ్ళాను.


"ఇదిగో, పంతులూ! నీ బావి దాదాపు పూర్తి అయిందనీ, వెంటనే మూడో వాయిదా డబ్బు నీ కివ్వాలనీ రాసేసేరు పెద్ద దొర. రేపో— ఎల్లుండో వచ్చి డబ్బు తెచ్చుకో. మొత్తం మీద చాలా అదృష్టవంతుడివేలే" అన్నాడు వాళ్ళలో నాకు పరిచయంలేని ఒక వ్యక్తి. నేను ఏ ఉద్దేశమో నాకే అర్థంకాని రీతిలో తలాడించేను. వాళ్ళు వెళ్ళిపోయారు. 'పంతులూ! అయిన ఖర్చూ, అయ్యగారి దక్షిణా ఈ కాగితంలో లెక్క రాసేను. ఇరవై రూపాయలు నీకూ, ఇంతటి శ్రమా — తలనొప్పీ నాకూ మిగిలేయి. ఇంద—తీసుకో' అంటూ ఒక కాగితం అందించి ఇంట్లోకెళ్ళిపోయాడు. ఇరవై రూపాయలూ తెచ్చి ఇస్తాడు కాబోలు ననుకుని అరగంట అక్కడే నిలబడ్డానుగానీ, ఆయ నెంతకీ బయటికి రాకపోవడంతో అక్కడినించి కదిలి వచ్చేశాను.

నే నిక ఆ బావి జోలికి వెళ్ళలేదు. వెళ్ళగూడదని గూడా నిర్ణయించుకొన్నాను. కానీ, అప్పటికే పని వాళ్ళకి కొంత డబ్బు బాకీ పడి ఉన్నాను. ఏదయితే అదయిందని ఆ మూడో వాయిదా డబ్బు తెచ్చుకొన్నాను. నాఅసమర్థతని గుర్తించో, మళ్ళీ వీడెందుకు రాబోతాడూ? అయిన కాడికి ఇప్పుడే ఒడుపుకుందామనో మొత్తం మీద నా లెక్కన అయిదువేల ఖర్చుకి రావలసింది రెండువేలైతే, ఏదేదో లెక్క చెప్పి, మళ్ళీ పదహారు వందలే చేతికిచ్చారు. పనివాళ్ళ కివ్వగా మిగిలింది బావి త్రవ్వేందు కెలాగూ సరిపోదని, చాలా కాలానికి ఇంటిల్లిపాదికీ కాస్త నదరైన గుడ్డలు కుట్టించాను. ఆ వ్యవహారం అంతటితో ముగిసింది.

ఆర్నెల్ల క్రితం ఒక పెద్దమనిషి వచ్చి బావి తాలూకు రెండు వాయిదాలూ, వడ్డీ కలిపి మూడువే లయ్యాయి. కట్టమన్నాడు. జరిగినదాన్ని పొల్లు పోకుండా వివరించి, సంవత్సరమంతా తినడానికని దాచుకొన్న ధాన్యం అమ్మితే వచ్చిన రెండువేలూ ఆయన చేతుల్లో పోసి దండం పెట్టేను. ఆయన మరో ధర్మోపదేశం చేసేడు. బావికి ఇంజను కావాలని దరఖాస్తు పెట్టుకోమన్నాడు. ఇంజను డబ్బు తెచ్చి బావి వాయిదాలు కట్టుకోమన్నాడు. "మరి ఇంజను డబ్బు కట్టడమెలా?" అనడిగితే, నేనేదో మహాపరాధం చేసినట్టు బండ బూతులు తిట్టి, నెల రోజుల్లోగా వెయ్యి రూపాయలూ కట్టకపోతే పొలం వేలం వేయిస్తానని బెదిరించి వెళ్ళిపోయాడు.

నే నెటూ తోచక ఆలోచిస్తూన్న తరుణంలో, "మీ నిజాయితీ, నిక్కచ్చితనాల్ని గూర్చిన ప్రశంస వినవచ్చింది. ఆఫీసు చిరునామాకు రెండు అర్జీలు పంపుకొన్నాను. నెలలు గడిచినా వాటికి జవాబు రాకపోవడంతో ఎవరో సలహా ఇవ్వగా, ఇంటి చిరునామాకు ఈ ఉత్తరం వ్రాసుకున్నాను."

గంటసేపు ఓపిగ్గా విన్న కలెక్టరుగారూ ఆయన భార్యా నిట్టూర్చారు. కలెక్టరుగారు కొంచెంసే పాగి, "సరే, ఈ సంగతేదో నేను చూస్తాను. మీరు వెళ్ళి రండి" అన్నారు.




"నా సంగ తొదిలేయండి, బాబూ! జరిగిందేదో జరిగింది. ఇందులో ఎవరి తప్పు ఎంత పాలైనా, మూలం నేనే కదా! నా బాధ్యతను నేను తప్పించుకో గలనా? పొలం అమ్మివేసి అయినా అప్పుతీర్చుకుంటాను. భుక్తికా? పారంపర్యంగా వస్తున్న వృత్తి ఉండనే ఉంది. అది ఎలాగూ చేయక తప్పదు. కానీ నా బాధల్లా ఏమంటే, నాలా మరి కొందరు ఈ ఉచ్చుల్లో చిక్కుకో కూడదు. అలాంటి ఏర్పాటేదయినా చేయ గలిగితే చూడండి. నా అనుభవం పదిమందికీ అక్కరకు రావడాని కన్నా నా క్కావలసిందేమిటి?" అన్నారు సింగరాచార్యులు.

"సరే, చూద్దాం! మీరు వెళ్ళిరండి!" అన్నారు కలెక్టరు.

ఏదో మంత్రం గొణుగుతూ దంపతు లాశీర్వదించి, "వస్తాను, బాబుగారూ! వస్తానమ్మా!" అని చేతులు జోడించి బయటకు నడిచారు.

• • •

రానున్న నెలకు కలెక్టరుగారి అడ్వాన్సు టూర్ ప్రోగ్రామ్ వచ్చింది. "దీన్ని మనకెందుకు పంపారూ?" అనుకుని పరిశీలనగా చూశారు బ్యాంకు సెక్రెటరీ. ఒక చోట కళ్ళాగి పోయాయి. ఒళ్ళు జలదరించింది. మరోసారి చదువుకున్నారు ఆ ఒక్క లైను నీ!

తేదీ ... రంగాపురం. "సింగరాచార్యుల చేనిలో బావిని సందర్శించుట!"

తాను సూపర్‌వైజరుగా ఉన్నప్పుడు జరిగిన సంగతంతా సినిమాలా కళ్ళముందు కదలాడింది. ఏం జరిగింది? ఏదో జరిగే ఉంటుంది. అప్పు డతడి మెత్తదనం చూసి తాము కొంచెం "ఓవర్" చేసిన మాట వాస్తవమే. ఇప్పు డేం చేయాలి? కలెక్ట రసలే చండశాసనుడు. ఈ దెబ్బతో ఉద్యోగమే వూడచ్చు. అది పోతే పోయింది. బ్రతకలేమని కాదు గానీ, కటకటాల వెనక్కి పంపేందుకు గూడా వెనుదీయడు.

మరో పది నిముషాల్లోగానే సెక్రెటరీ గదిలో అత్యవసర సమావేశం ఏర్పాటయింది. వెనకటికి ఆ బావి వ్యవహారంలో భాగం పంచుకున్న వాళ్ళందరూ గుమిగూడారు. బయటివాళ్ళెవరైనా చూస్తే ముద్దుల భార్యలవో, ప్రియతములైన పిల్లలవో— శవాలు ముందేసుకు కూర్చున్నంత విషాదం కనిపిస్తూంది ముఖాల్లో.

ఇంతలో ప్యూన్ వచ్చి "జిల్లా కేంద్రం నుండి మని షొచ్చాడు. కలెక్టరాఫీసట. పంపించ మంటారా?" అన్నాడు. అందరూ ఒకేసారి జేబులో తేలు కనిపించినంతగా ఉలిక్కిపడ్డారు. సెక్రెటరీ కొంచెం తేరుకుని "సరే, పంపించు" అన్నాడు, కలెక్టరే స్వయంగా వచ్చేడేమో నన్నంత గాభరా పడిపోతూ.

ఆ వచ్చినతను "నా పేరు శ్రీరాం. కలెక్టరాఫీసులో గుమాస్తాని" అని తన్ను తాను పరిచయం చేసుకుని ఒక కాగితం అందించి, "కలెక్టరుగారు మీ బ్యాంకునుండి రంగాపురం గ్రామంలో బావుల కిచ్చిన అప్పులకు సంబంధించిన ఫైళ్ళు తెమ్మన్నారు. వెంటనే బస్సు ఉంది. అవి ఇచ్చేస్తే నేను వెళ్ళిపోగలను. లేకుంటే ఈ రోజు కీ వూళ్ళోనే ఉండిపోవాల్సి వస్తుంది" అన్నాడు.

సెక్రెటరీ అతి కష్టం మీద గాభరాని కప్పిపుచ్చుకుని, "నలభై మైళ్ళు బస్సు ప్రయాణం చేసి ఇప్పుడే కదా వస్తున్నారు. మళ్ళీ వెంటనే ప్రయాణం చేయడం బోర్ కాదూ? ఈ రోజు కిక్కడే ఉండి రేపు వెళుదురు గాని" అని అతడికి మాట్లాడేందు కవకాశం ఇవ్వకుండా, ప్యూన్ని పిలిచి "అయ్యగార్ని రామా లాడ్జిలో ఒకరూమ్ బుక్ చేసి దిగబెట్టిరా! డ్రైవర్ని పిలిచి, జీప్ పట్టుకెళ్ళు" అన్నాడు. శ్రీరాం ఏదో అనబోతూండగా మళ్ళీ అడ్డం తగిలి, "ఫరవా లేద్సార్! మీ రెళ్ళి స్నానం చేసి రెస్టు తీసుకుంటూ ఉండండి. ఈ లోగా మేం వచ్చేస్తాం. మీతోపాటే వచ్చే వాళ్ళం కానీ, అతి ముఖ్యమైన ఒక విషయం మీద మాట్లాడుతున్నాం" అంటూ ప్యూన్‌కి సైగ చేశాడు. ప్యూన్ ముందుకు దారి తీయగా శ్రీరాం వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళిపోయాడని స్థిరపరుచుకున్నాక, "దీని కేదో పరిష్కారం వెంటనే ఆలోచించక తప్పదు. ఏదో విశేషం జరిగే ఉంటుంది. లేకుంటే, ఆ బావినే కలెక్టరు చూస్తా ననడ మేమిటి? ఆ ఫైళ్ళు తెమ్మనిమనిషిని పంపడమేమిటి?" అన్నాడు సెక్రెటరీ.

"వెధవ సంత కాకపోతే మన వ్యవహారంతో వీడి కేమిటి సంబంధం? ఇదేమైనా గవర్నమెంటు బ్యాంకా?" అని ఒకాయనంటే "ఈ డైరెక్టు రిక్రూటీస్ ఇంతే, గురూ! తామేదో మహా ఉద్ధరించడానికి

అవతరించామనుకుంటారు. నాలుగు ఉండేల దెబ్బలు తగిలితే కానీ వీళ్ళ ఉలు కణగదు'' అన్నాడు మరో ఆయన.

"వాడి ఉలుకు సంగతి తీరిగ్గా చూద్దాం కానీ ముందు మన ఉలుకు అణగబోతున్న సంగతాలోచించండి'' అన్నాడు సెక్రెటరీ అసహనంగా. అందరూ "ఈ కథ కంతటికీ మూలం నువ్వేనంటే నువ్వే'' నని వాదులాట మొదలెట్నేసరికి ఆఫీసు కల్లు కాంపౌండ్‌లా తయారయింది. ఇంతలో శ్రీరాం సరాసరి లోపలి కొచ్చేశాడు. గలభా అకస్మాత్తుగా ఆగిపోయింది. కరెంట్ పోయినప్పటి రేడియోలా.

"అదేం? మీరు లాడ్జికి వెళ్ళలేదా?'' అన్నాడు సెక్రెటరీ.

"సారీ, ఫ్రెండ్స్! మీరు నన్ను పరాయి వాడిలా భావించడం ఏమీ బాగుండ లేదు. మీ రిప్పు డింత తీవ్రంగా చర్చిస్తున్న విషయ మేమిటో నాకు తెలీదనే అనుకుంటున్నారా? తెలుసు. అయితే దీనికి పరిష్కారం ఏ మాలోచిస్తున్నారు?'' అన్నాడు శ్రీరాం అందరినీ కలియజూస్తూ. అందరూ తీవ్రాలోచనలో పడిపోయారు. కాస్సే పాగి మళ్ళీ తనే, "ఇప్పుడు కలెక్టరుగారు పై లెందుకుతెమ్మన్నారో వూహించారా'' అన్నాడు. "ఎందుకూ?'' అన్నట్లుగా చూశారు.

"మీలో కొందరైనా ఆ బావి పనిని పర్యవేక్షించామనీ, 'ఇంత' పని పూర్తయిందనీ సర్టిఫికేట్లిచ్చి ఉంటారు! అవునా?''

"అవును'' అన్నట్లుగా తలాడించే రందరూ.

"అయితే మరేం లేదు. ఎవరెవరు ఎంతవరకు పని జరిగిందని సర్టిఫై చేశారో, ఆ మేరకు వాళ్ళు బాధ్యు లవుతారు. కలెక్టరు గారు చండ శాసనులు. ఇది ఇంతటితో ఆగదు. మీ రిచ్చిన ఆప్పుల్లో ఇలాంటి కేసులు నాల్గింట ఒకటయినా ఉంటాయి కదా! ఇక క్రమంగా ఆ డొంకంతా కదులుతుంది.''

తెరిచిన నోళ్ళు మూయడం మరిచి చూస్తున్నా రందరూ,

"మరి దీన్నెలా సాల్వ్ చేద్దామనుకుంటున్నారు?'' అన్నాడు శ్రీరాం మళ్ళీ.

"అదే అర్థమయి చావడంలేదు''అన్నాడొకాయన.


"నేను చెబుతాను, వినండి.'' శ్రీరాం అన్నాడు. అందరూ ఆత్రతగా చూస్తున్నారు.

"మరేం లేదు. ఆ బావి విషయంలో కలెక్టరు గారికి వచ్చిన కంప్లయింట్ అబద్ధమనినిరూపించాలి.''

"కానీ అబద్ధమని ఎలా రుజువు చేసి చచ్చేదీ?'' అన్నారు కోరస్‌లో.

"దానికి మార్గం ఉంది. కాకపోతే, తలా కాస్త చము రొదులుతుంది. వదిలినా మేలే! మీ రేమీ అనుకోనంటే ఒక మాట అంటాను. ఇంతవరకు మీ రిలా సంపాదించినదాంట్లో ఇది నూరోవంతు కూడా కాదు. అధవా అయినా ఉద్యోగా లూడడమూ, కోర్టుల చుట్టూ తిరగడమూ కన్నా ఇది చాలా మేలే కదా?'' అందరి ముఖాలూ పాగ చూరినట్లయ్యాయి.

"సరే! ఏం చేయమంటారో చెప్పండి'' అన్నాడు




సెక్రెటరీ.

"ఏం లేదు. వెరీ సింపుల్. ఎవరెవరు ఎంత వరకు పని జరిగిందని సర్టిఫికెట్లిచ్చారో, వాళ్ళు అంత పనీ సొంత డబ్బుతో చేయించాలి. కలెక్టరు గా రొచ్చేసరికి బావి సిద్ధంగా ఉండాలి. దానితో ఈ గండం గడవడమే గాక, ఇలాంటి కేసు లిక ముం దేమైనా వచ్చినా, ఆయన ఇంత సీరియస్‌గా తీసుకోరు. అసలు పట్టించుకోక పోవచ్చు కూడా!''

మరోసారి కొంచెం గలభా రేగి పది నిముషాల్లో సర్దుకుంది. వేరే మార్గం తోచకపోవడంతో అందరికీ ఆ సూచన అంగీకార మయింది.

"నాకు పైలిప్పిస్తే నే వెళ్తాను'' అన్నాడు శ్రీరాం.

"అమ్మమ్మా! ఎంత మాట! ఇంతటి చిక్కునీ చిటికెలో విప్పేసిన మిమ్మల్ని సత్కరించనిదే వెళ్ళ నివ్వడమా? వీల్లేదు. రాత్రికి మీరు మా ఆతిథ్యం స్వీకరించాల్సిందే'' అన్నాడు సెక్రెటరీ. విధిలేక ఒప్పుకుంట నన్నట్లు "సరే, మీ రింతగా బలవంతం చేస్తుంటే నేను కాదనడం సభ్యత కాదు. పైగా నా బస్సు కూడా ఈ పాటికి వెళ్ళిపోయే ఉంటుంది'' అన్నా డతను.

• • • •

కలెక్టరుగారికి నమస్కరించి పైలు అందిస్తూ, "అంతా మీరు చెప్పినట్లేచేశాను, సార్! వాళ్ళప్పుడే తమ వంతు ప్రయత్నాల్ని ప్రారంభించారు కూడా! 'ఇప్పుడా వూరి కెళ్ళి వాడికి ముఖమెలా చూపించడం?' ఇది ముగిసేసరకూ వెధవ ఉళ్ళో లేకుండా పోతే బాగుండును అనుకుంటున్నారు, సార్!'' అన్నాడు శ్రీరాం.

కలెక్టర్ సన్నగా నవ్వి "గుడ్'' అని, "సింగరాచార్యుల అడ్రెస్‌కి ఒక కార్డు రాసి పడేయ్. నెంరోజు లిక్కడే ఉండిపోయేందుకు సిద్ధపడి రమ్మను''అన్నారు.

"మీ బావి దొంగలు నెల్లాళ్ళలోగా దాన్ని తెచ్చి యథాస్థానంలో ఉంచుతారట. మీ ముందుకు రావడానికి సిగ్గు పడుతున్నారు. అందుచేత ఈ నెల్లాళ్ళూ మీ రిక్కడే ఉండాలి. మీ కాంక్షేపానికి సంస్కృత పాటశాలలో వ్యాకరణం బోధించే ఏర్పాట్లు చేశాం. మీ రెళ్ళి డి. ఇ. వో. గారిని కలవండి'' అన్నారు కలెక్టరు.

"మీ దయకు కృతజ్ఞుణ్ణి. ఇంతకన్నా బాగా కృతజ్ఞతని ఎలా తెలుపుకోవాలో నాకు తెలీదు'' అంటూ నమస్కరించి సెలవు తీసుకున్నారు సింగరాచార్యులు.

• • •

గ్రామాధికార్లకు కలెక్టరు రాకను గూర్చిన తాకీదు లేమీ అందలేదుగానీ, ఆయన ఫలానా తేదీన వస్తున్నారని రంగాపురం గ్రామం అంతటా పాక్కింది. అందుకు నిదర్శనం ఆచార్యుల వారు వూళ్ళో లేకున్నా బ్యాంకువాళ్ళు ఆయన బావి పనిని దగ్గరుండి పూర్తి చేయించడమే.

ఎందుకైనా మంచిదని వూరంతా శుభ్రంగా వూడ్పించి, తోరణాలు కట్టించారు. గ్రామ చావడికీ, పంచాయతీ కార్యాలయానికీ వెల్లవేయించారు. స్వాగతానికి అన్ని ఏర్పాట్లూ చేసి, వూరి బయట రోడ్డుపై గుమిగూడి నిరీక్షిస్తున్నారు గ్రామ పెద్దలంతా.

ఏదో బస్సులోంచి సింగరాచార్యులు దిగేరు. ఆ గుంపు నంతా చూసి "విశేష మేమిటి?'' అనడిగేరు.

"మీరు యాత్రలకని వెళ్ళారా—ఆ వెంటనే కలెక్టరుగారి పంపున బ్యాంకువాళ్ళొచ్చి నెల్లాళ్ళూ అవస్థపడి మీ బావి త్రవ్వించి మరీ వెళ్ళారు. ఎంతలు నా అదృష్టవంతులు మీరు. కలెక్టరుగా రొచ్చే నాటికి మీరూ దిగేరు'' అన్నాడు పట్వారీ, లోగడ అతడిని తనెలా ఈసడించుకొన్నదీ మరిచి పోయినట్లుగా.

"కలెక్టరుగారు రావడమేమిటి! వా రీ రోజు కలెక్టర్ల మీటింగు కని నిన్ననే హైదరాబాదు వెళ్తేనూ! అస లింకా మూడ్రోజుల్దాకా జిల్లాకే రారు తెల్సా?''అంటూ గబగబా అడుగులు వేస్తూ వూరికేసి నడిచారు ఆచార్యులు, తన పొలంలో బావిని చూసుకోవాలనే ఆత్రతతో.

పట్వారీతోపాటు, మిగతా వాళ్ళంతా విభ్రాంత పోయి చూస్తూ ఉండిపోయేరు. ★